విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

జిల్లాస్థాయి అవార్డుకు ఉంగుటూరు పంచాయతీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: జాతీయ పంచాయితీ అవార్డ్ లలో మొత్తం 9 థీమ్ లలో ఉంగుటూరు గ్రామ పంచాయితీ అన్ని థీమ్ లలో మండల స్థాయి, జిల్లాస్థాయి ఉత్తమ పంచాయితీగా ఎంపికైందని ఉంగుటూరు కార్యదర్శి గిరిధర్, సర్పంచ్ బండారు సింధులు ఆదివారం తెలిపారు. వసతుల కల్పన థీమ్‌లో జిల్లా స్థాయిలో ఎంపిక అయి రాష్ట్ర స్థాయి కు నామినేట్ అయిందన్నారు. కార్యదర్శి, సర్పంచ్ మాట్లాడుతూ అందరి సకారంతో జిల్లా స్థాయిలో అవార్డుకు ఎంపిక వచ్చిందన్నారు.గ్రామ పంచాయతీ మండల స్థాయి జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం ఆరబోత ప్రాంతాల పరిశీలన

విశాలాంధ్ర-ఉంగుటూరు: రబీలో ధాన్యం సేకరణ ప్రక్రియలో ఉంగుటూరు మండలంలో సంచులు ట్రాన్స్పోర్ట్ సమస్య లేకుండా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని తహశీల్దార్ ఏవి రమణారావు అన్నారు. ఆదివారం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాలు, దాన్యం ఆరబోత ప్రాంతాల్లో పరీక్షించారు. ఈ సందర్భంగా రైతు సమస్యలను అడిగి ఆరా తీశారు. అవసరమైన సంచులను వాటిని రవాణా చేసేందుకు లారీలను అందుబాటులో ఉంచామన్నారు. రోజుకు 120 లారీలు ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులు గోనె సంచులకు, లారీలు కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తాహసిల్దార్ చెప్పారు.

నరసాపురంలో నేడు జిల్లా స్థాయి స్పందన

విశాలాంధ్ర-భీమవరం: స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం గం. 10 నుంచి నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం గం.10 గంటల నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు. జిల్లా అధికారులు ఉదయం గం. 9.30లకు నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరం విధిగా హాజరు కావాలని అన్నారు.

ఏలూరు కలెక్టరేట్‌లో కూడా..

ఏలూరు: జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో నేడు ఉదయం గం.10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం నేటి ఉదయం గం.10 నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

కాపు జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వర్రావు

విశాలాంధ్ర-ఆకివీడు: కాపు జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లుజనసేన పార్టీ నాయకులు విశ్వేశ్వర్రావు తమ్మిశెట్టి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాను మానవ మానవ హక్కుల సంఘంలో జాతీయ జాయింట్ సెక్రటరీ గా,కాపు రాక్స్ పునాదుల నుండి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అఖిల భారత బీసీ సంఘంలో రాష్ట్ర గౌరవఅధ్యక్షులుగా , చైల్డ్ రైట్స్ ఫోరమ్‌లో జిల్లా కో కన్వీనర్‌గా తను చేసిన అనేక సేవలను దృష్టిలో పెట్టుకుని కాపు జేపీసీ అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ తనను నియమించినట్లు తెలిపారు.

వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వెంకన్నను హైకోర్టు జడ్జి ఎం. మన్మథరావు ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రదక్షిణలు అనంతరం స్వామిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వెంకన్న ముఖమండపంలో ఆలయ వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు శ్రీవారి చిత్రపటాన్ని ప్రసాదాలను జడ్జి దంపతులకు అందజేశారు.

నేడే వాహనాల వేలం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 10గంటలకు వివిద ఎక్సైజ్ కేసుల్లో సీజ్‌చేయబడిన 21మోటార్ సైకిల్స్ వేలం వేయబడునని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. పాటలో పాల్గొనేవారు పాట మొత్తానికి 18శాతం జిఎస్‌టితో కలిపి వెంటనే చెల్లించాలని తెలిపారు.

వాతావరణంలో మార్పులు

విశాలాంధ్ర-లింగపాలెం: వర్షం.. ఉరుములు.. ఎండ ఇటువంటి పరిస్థితి ఆదివారం లింగపాలెం మండలంలో ఏర్పడింది. మండలంలో కొద్దిపాటి వర్షం పడింది. ఈ సమయంలో వాతావరణం చల్లబడింది. వర్షంతోపాటు ఉరుములు భయంగొల్పాయి. ఇంతలోనే ఎండ. వర్షం తరువాత వచ్చిన ఎండకు ప్రజలు అల్లాడిపోయారు. వాతావరణ మార్పులతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సాహసించ లేకపోయారు.

దంపతులకు ఆదరణ

విశాలాంధ్ర-లింగపాలెం: జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భార్యభర్తలు చేస్తున్న ఇంటింటా ప్రచారంపై ఆసక్తి నెలకొంది. ఎక్కడ నుంచో వచ్చి క్షవర వృత్తి చేసుకునే గుండిమెడ శ్రీనివాస్‌ను ధర్మాజీగూడెం ప్రజలు వార్డు మెంబరుగా గెలిపించారు. పార్టీకి అంకిత భావంతో ఉన్న ఈయన సేవలను గుర్తించి వైసీపీ నాయకులు ఈయన భార్య శ్రీదేవిని గ్రామానికి ఒక కన్వీనర్‌గా నియమించారు. భార్య భర్తలిరువురు తమకు అప్పగించిన బాధ్యతను ఇంటింటికి వెళ్ళి నిర్వహిస్తున్నారు. ఈ దంపతులను స్థానికులు ఆదరిస్తున్నారు. సొంత ఊరు కాకపోయినా నివసిస్తున్న ఊరే మా ఊరనుకుని సేవలు చేస్తున్న ఈ దంపతులకు ప్రజలు మద్ధతుగా ఉన్నారు.

నేడే భూ రీసర్వేపై గ్రామసభ

విశాలాంధ్ర-టి నరసాపురం: నేడు బొర్రంపాలెం గ్రామంలో భూ రీసర్వేపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ జెవి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభకు అధికారులతో పాటు స్థానిక రైతులు హాజరు కావాలని ఆయన కోరారు. భూ రీసర్వేపై రైతులకు సందేహాలు వుంటే గ్రామా సభలో నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు.

మొండి మోదీని సాగనంపుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: సైనికుల మనోభావాలను దెబ్బ తినే విధంగా మోదీ పాలన సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం స్థానిక రామచంద్రరావుపేట పార్క్ వద్ద సీపీఐ, సీపీఎం ప్రచారభేరి ముగింపు బహిరంగసభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతుల కళ్ళల్లో ఆనందం నింపుతానని మోసం చేసి వ్యవసాయాన్ని కార్పొరేట్ మయం చేయడానికి 3 వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులకు తీరని అన్యాయం తలపెట్టారని విమర్శించారు. మొండి మోదీని రైతులు ఢిల్లీ నడిబొడ్డున ఆందోళన చేసి క్షమాపణ చెప్పించారన్నారు. అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని విమర్శించారు. ప్రజల సంపదైన బ్యాంకుల్ని మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని ఆఖరికి మనందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్ సంస్థలకు బీజేపీ కట్టబెడుతోందని విమర్శించారు. పేదలు సామాన్య ప్రజలపై మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్ కరెంటు చార్జీలను మోయలేని విధంగా పెంచి నడ్డి విరుస్తోందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు స్వాతంత్ర్య కాలము నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, పెట్టుబడిదారులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి చేరని ద్రోహం చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, ప్రత్యేక హెూదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోను, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తదితర అనేక అంశాల్లో రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాబోయే కాలంలో కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో జగన్‌ని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు బి సోమయ్య ప్రసంగించారు. ఈ బహిరంగ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సీపీఎం జిల్లా నాయకులు కే శ్రీనివాస్, ఏ శ్యామల రాణి, పి ఆదిశేషు పాల్గొన్నారు.

ఏలూరు: మోసపూరిత మాయమాటలతో మోసం చేస్తున్న దగాకోరు మోదీని తరిమికొట్టాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక రామచంద్రరావు పేట పార్కు వద్ద సీపీఐ, సీపీఎం ప్రచార భేరి ముగింపు బహిరంగ సభ సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ బహిరంగ సభలో పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోదీ తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఏటా 2 రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేస్తానని అధికారం చేపట్టి 8 సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఉద్యోగాల కల్పన ఊసే లేకుండా ఉన్న ఉద్యోగాలను ఊడబెరికారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా

వ్యవహరిస్తూ పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.5 తగ్గించడం కారణంగా జాతీయ ప్రాజెక్టు హోదా కోల్పోయి మినీ రిజర్వాయిగా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మంత్రులు విభిన్న ప్రకటనలతో మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాటలు ఆడుతున్నారన్నారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి అనటికట్ల రవి మాట్లాడూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, సభ్యులు తెర్లాపు శ్రీను, సాయన అభిలాష్, కొండేటి రాంబాబు, ఉప్పులూరి లక్ష్మి, భవాని, మావూరి విజయ, నాగం అచ్యుత్, దుగ్గిపోగు రాజాలాల్, భజంత్రీ శ్రీను, బేతా శంకర్, పీపీ శాస్త్రి, గొర్లి స్వాతి, కే ప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కే శ్రీనివాస్, ఏ శ్యామల రాణి, పి. ఆదిశేషు, నగర నాయకులు బి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను పట్టించుకోరా?...

కుకునూరు: ఏళ్లు గడుస్తున్నా పోలవరం ప్రాజెక్టునిర్వాసితుల పరిహారం ఊసే లేదని, వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప నిర్వాసితుల కష్టాలు తీరడం లేదని ఓ వైపు నిర్వాసితులను త్యాగధనులని కీర్తిస్తూనే నిర్వాసితును పట్టించుకోవడంలేదని సీపీఐ, సీపీఎం నేతలు ప్రభుత్వ తీరును విమర్శించారు. బీజేపీని గద్దెదించుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్ర ఆదివారం మండలంలోని సీతారామ నగరంలో ప్రారంభమై శ్రీధర, వేలేరు, వెంకటాపురం, అల్లిగూడెం, బోనగిరి, బంజరుగూడెం, అమరవరం, రాజీవనగర్, ఉప్పేరు, దామరచర్ల, పెదరవిగూడెం, చీరవల్లి గ్రామాలలో సాగింది. సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సీపీఐ నాయకులు కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, మడిపల్లి రమణయ్య, కొమ్ము హుస్సేన్, వరకా నరసింహారావు, వరసా నాగేశ్వరరావు, సోడె నాగేష్, ఇరమయ్య, రామయ్య, మారయ్య, కూరాకుల బాబురావు, సీపీఎం నాయకులు యర్నం. సాయికిరణ్, వలీ పాషా, రమేష్, మోహనరావు పాల్గొన్నారు.

వాడ వాడలా మేడే ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-తణుకు: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే రోజున కార్మికులు వాడవాడలా అరుణపతాకాలు ఆవిష్కరించి ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. ఏఐటయూసీ తణుకు ఏరియా సమితి సమావేశం ఆదివారం తణుకు సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మేడే రోజున కార్మికులు అరుణ పతాకాలను ఆవిష్కరించి, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించి మేడే ఆవశ్యకతను వివరించాలని కోరారు. సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి కార్మిక సంఘాల నాయ కులు అట్రు వెంకట్రావు, నాగశివశంకర్, బొంగు శ్రీరామ్మూర్తి, కె.వి. రమణ, మందుల ముత్తయ్య, గెడ్డం వెంకటేశ్వరరావు, పసల అప్పన్న పాల్గొన్నారు.

తణుకు: నియోజకవర్గంలోని తూర్పు విప్పర్రులో ఆదివారం సీపీఐ గ్రామశాఖ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. తూర్పు విప్పర్రు గ్రామంలోని సీపీఐ కార్యాలయంలో మేడే కార్మిక దినాన్ని ఘనంగా నిర్వహించాలని గ్రామంలో పార్టీ తోరణాలతో అలంకరణ చేయాలని గ్రామ శాఖ తీర్మానించింది. సీపీఐ ఇరగవరం మండలం కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, ప్రజా నాట్య మండలి నాయకులు గిద్దా సూర్య నారాయణ, కుడుపూడి వెంకటరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కామవరపుకోట: పోరాటాల ఎర్రజెండా ఎత్తి పడుతూ వాడ వాడల ఎర్రజెండాలు ఎగరవేసి 137 మేడే పండుగ ఘనంగా జరుపుకోవాలని కార్మిక సంఘాలకు సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అన్నపూర్ణ రైస్ మిల్లు ఆవరణలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీవీఎస్ రాజు పాల్గొన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఎం దుర్గారావు, జి సత్యనారాయణ, బీవీ రాఘవులు, కె వెంకటేశ్వరావు, బాలిన రమణారావు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రాళ్ల దాడి హేయం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ పై వైసీపీ గూండాలు రాళ్ల దాడి చేయడం, ఆయన భద్రత సిబ్బందిని గాయ పరచడం పై టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు చూడని దౌర్భాగ్యకరమైన పరిస్థితు లను చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కాన్వాయ్ పై రాళ్లు విసరడం భద్రతా సిబ్బంది తలలు రాళ్లతో పగలగొట్టడం చూస్తుంటే ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా లేక రౌడీ రాజ్యం పాలనలో ఉన్నామా అని ఆందోళన కలుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు సీఎం అవుతారని మేఘలాదేవి పేర్కొన్నారు.

'చూడ చక్కని చిత్రం'కు దాసరి పురస్కారం

విశాలాంధ్ర-వీరవాసరం: అవార్డులు బాధ్యతను పెంచుతాయని, ఎంతో ప్రతిష్టాత్మమైన దాసరి ఫిల్మ్ అవార్డ్ రావడం చాలా గర్వకారణమని తెలుగు లఘు చిత్రాల దర్శకుడు అడబాల లక్ష్మీ నారాయణ తెలిపారు. రాయకుదురు గ్రామానికి చెందిన లఘు చిత్రాల దర్శకుడు, శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి అడబాల లక్ష్మీ నారాయణ దర్శకత్వంలో అడబాల రామ కృష్ణుడు నిర్మాతగా పద్మజ నారాయణ సహా నిర్మాతగా నిర్మించిన లఘు చిత్రం చూడ చక్కని చిత్రంకు దాసరి ఫిల్మ్ అవార్డు రావడం ఆనంద దాయకమన్నారు. మే 1వ తేదీన హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో సినీ శ్రామికుల సమక్షంలో జరుగు దాసరి ఫిల్మ్ అవార్డు ఫంక్షన్ లో సినీ పెద్దల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నట్లు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-పెంటపాడు: అకాల వర్షం కారణంగా పెంటపాడు మండలం ముదునూరులోని వ్యవసాయ రైతులను కలిసి వారి నుంచి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కలింగ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు, రైతులు తరఫున డిమాండ్ చేశారు. ఆదివారం ముదునూరు గ్రామంలో రైతులను వద్దకు వెళ్లి సందర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, రాజులపాటి ముత్యాలు, తాడాల వెంకటేశ్వర్లు, దొడ్డి శ్రీను, కూటికప్పల ముస లయ్య, పెంకి చిన్నారావు, ఏ.దాస్. డి సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గణపవరం: విద్యుత్ షాక్ తగిలి ఒక వ్యక్తి మృతి చెందినట్లు గణపవరం ఎస్ ఐ వేముల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గణపవరం మండలం వెంకట్రాజపురం గ్రామపంచాయతీ ఏరియాలో గంధం గోవిందరావు చెరువు మీద పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సిప్పు హెంబ్రం(23) చెరువుకు అమర్చిన జనరేటర్ను ఆఫ్ చేయుచుండగా విద్యుత్ షాక్ తగిలి పడిపోయినట్లు తెలిపారు. పడిపోయిన వ్యక్తిని అదే చెరువు పై పని చేస్తున్న అతని అన్నయ్య ముల్లాక్ హెబ్రం, ఇంకో ఇద్దరు కలసి పిప్పర హాస్పటల్ కు తీసుకు వెళ్ళగా డాక్టర్ పరీక్ష చేసి అప్పటికే చనిపోయి ఉన్నాడని చెప్పినట్లు ముల్లాక్ హెబ్రమ్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి ఎస్ ఐ దర్యాప్తు చేస్తున్నారు .మృతుడికి ఇంకా వివాహం కాలేదని ఎస్ ఐ తెలిపారు.

ఎన్టీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-తణుకు: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తణుకు పట్టణంలో ఎన్టీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను తణుకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభించారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుంటూ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం చాలా సంతోషమని పితాని అన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దొమ్మేటి వెంకట సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పరిమి వెంకన్నబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంత్రిరావు బాబు, తణుకు పట్టణ పార్టీ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కలిదిండి: గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చందన.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కోరుకొల్లు గ్రామంలో లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఉద్దేశం ఉచిత వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసేయండి ప్రారంభించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ రికార్డు పోటీలకు శ్రీఖ్యాతి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెంకు చెందిన శ్రీఖ్యాతి కళాకర్ బుక్ ఆఫ్ వరల్డ్ ఎంపికకు అర్హత సాధించింది. మూడవ తరగతి చదువుతున్న ఈ బాలిక ఈనెల 16న ఆన్‌లైన్ జూమ్ ద్వారా నిర్వహించిన పోటీలలో పాల్గొంది. ఎనిమిది నిమిషాలలో 20 పద్యాలు, 25 నిమిషాలలో 60 తెలుగు శత పద్యాలను వినిపించటంతో ప్రపంచ స్థాయి రికార్డుకు ఎంపిక చేశారు. వీటి ఫలితాల వివరాలను ఆదివారం బాలికకు పంపారు. తల్లి స్రవంతి, తాతయ్య అమ్మమ్మలైన రత్నకుమారి, మాదా సుబ్బారాయుడులు ఈ బాలికకు తర్ఫీదు నిచ్చారు. ఇప్పటికే అనేక పోటీలలో పాల్గొని బహుమతులు అందుకున్న శ్రీఖ్యాతి వరల్డ్ రికార్డును అందుకోవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి భూమి పూజ

విశాలాంధ్ర-కైకలూరు: మండలంలోని ఆటపాక గ్రామపంచాయతీ పరిధిలోని జాన్‌పేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ విజ్ఞాన కేంద్రం, శాంతిప్రదాత గౌతమ బుద్ధ విహార్ భవన నిర్మాణాలు భూమిపూజ అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కైక లూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ ఆవిష్కరించారు. కైకలూరు ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఆటపాక గ్రామ సర్పంచ్ తలారి మణి, ఎంపిటిసి సభ్యురాళ్లు పట్టపు బాలమ్మ, కైకలూరు గ్రామ సర్పంచ్ డిఎం నవరత్నకుమారి, ఆటపాక గ్రామ ఉపసర్పంచ్ బావిశెట్టి పాము, వరాహపట్నం సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, చిన్న తాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు, నేతలు కన్నా రమేష్, నవయాన్ బుద్ధిష్ట్ సొసైటీ వ్యవస్థాపక డైరెక్టర్ వంగలపూడి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం హోలిట్రినిటి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వాట్సప్‌లో, యూట్యూబ్‌లో వైరల్ అవ్వటంతో వీటిని తిలకించిన నెటిజన్లు ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందిస్తున్నారు. విద్యార్థుల నృత్యాలు, డ్యాన్స్‌లపై అభినందన చర్చ సాగుతుంది. స్కూలు వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు, డ్యాన్స్‌లు చేశారు. అరకులో గిరిజనులు చేసే దింసా నృత్యాన్ని చేసిన విద్యార్థులను పలువురు ప్రశంసిస్తున్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు దాదాపు 10 నిమిషాలు దింసా నృత్యాన్ని, కాంతార సినిమాలోని పాటకు పదవ తరగతి చదివే సంతోష్ అనే విద్యార్థి చేసిన నృత్యంపై అభినందనలు వస్తున్నాయి. పాఠశాల యాజమాన్యం ప్రయోగాత్మకంగా ఫ్రీ స్కూలు విద్యార్థులను ప్రాథమిక స్థాయికి ప్రవేశించేందుకు అర్హత పత్రాలను అందించారు. గ్రాడ్యుయేషన్ డేగా చేసిన ఈ కార్యక్రమంపై పిల్లలు, తల్లిదండ్రులు సంబరపడ్డారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో 375 మంది విద్యార్థులచే ప్రదర్శనలు చేయించటం విశేషంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కవిత, సిస్టర్ మేరి, సిబ్బంది ఎంతో శ్రమతో ఈ కార్యక్రమాలు నిర్వహించారని అధికారులే అభినందించారు.

వేడంగిలో జనం చెంతకు జనసేన

విశాలాంధ్ర-పోడూరు: వేడంగి గ్రామంలో జనసేన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జనం చెంతకు జనసేన కార్యక్రమం జరిగింది. జనసేన నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల జనసేన నాయకులు కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరిగి పవన్ కళ్యాణ్ ఒకసారి అవకాశం ఇవ్వాలని రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచారు. గ్రామ సర్పంచ్ చెల్లబోయిన పద్మ పార్వతీ శారద, ఉపసర్పంచ్ వీరగొమ్ముల బుజ్జి, ఎంపీటీసీ యర్రంశెట్టి వెంకట నరసింహారావు, పెనుమదం ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, మండల నియోజకవర్గ జనసేన నాయకులు బండారు రాజేష్, తులా రామలింగేశ్వర రావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-నిడమర్రు: సేవాకార్యక్రమాల ద్వారా ప్రజలకు సమాజానికి లబ్ది చేకూరుతుందని జనసేనాని ఆకాంక్ష మేరకు గ్రామాల్లో పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం అని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిమ్మల దొరబాబు, చింతలపాటి బాసి రాజు, గ్రామపార్టీ అధ్యక్షులు ఇంద్ర, ఉపాధ్యక్షులు సునీల్ కుమార, చందు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అభివృద్ధి పనులు కొనసాగించాలి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను జగన్ ప్రభుత్వం కొన సాగించాలని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి ఇంకా నెలలు మాత్రమే సమయం ఉందని ఇప్పటికైనా గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగిస్తే ప్రజలకు ఎంతో కొంత మేలు చేసిన వారవుతారని లేదా చరిత్రలో మరో తుగ్లక్‌గా మిగిలిపోతారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టేలా చంద్రబాబు పాలన సాగిస్తారన్నారు.

మంత్రి సురేష్ చదువుకున్న మూర్ఖుడు

విశాలాంధ్ర-తణుకు: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు కాన్వాయ్ పై రాళ్ల దాడి వైసీపీ రౌడీ రాజకీయాలకు నిదర్శనమని, మంత్రి సురేష్ చదువుకున్న మూర్ఖుడని టీడీపీ పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చుక్కా సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతను మర్చిపోయి రౌడీలా ప్రవర్తించడం చాలా దుర్మార్గ చర్యని అన్నారు. దళితుల్లో జగన్‌పై పెరుగుతున్న వ్యతిరేకతను దృష్టి మళ్లించడానికే రాళ్ల దాడి కుట్ర పన్నారని దుయ్యబట్టారు.

పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం...

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని చల్లవారి గూడెం వద్ద పోలవరం నిర్వాసితులకు ఏర్పాటు చేసిన పునరావాస ఆర్ అండ్ అర్ కాలనీలో ఆదివారం జంగారెడ్డి గూడేనికి చెందిన కాటన్ దొర హాస్పటల్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక పాస్టర్ కే.శైలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ యం.ఆంజనేయులు రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. హాస్పటల్ మేనేజర్ చైతన్య, కాలనీ అధ్యక్షుడు గిల్లా వెంకటేశ్వర్లు, వైసీపీ యూత్ అధ్యక్షుడు బద్దె ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.